ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక : 13-11-1998

# బొరుసు

రాఘవులుకు జబ్బు చేసిందంటే నాకు నమ్మశక్యం కాలేదు.

"నిజంరా! అపోలోలో చేర్చారు. నే వెళ్ళి చూసొచ్చా! మన స్పృహలో లేడు. శవంలా పడి వున్నాడు. ముక్కులో, గొంతుకలో ఏవేవో ట్యూబులు పెట్టారు" అని సహోద్యోగి చెబితే నమ్మక తప్పలా.

వెళ్ళి చూసొద్దామని మనసులో వున్నా నెలాఖరు రోజులు. అదీగాక ఆ ఆస్పత్రి దాకా వెళ్ళి రావాలంటే ఖర్చుతో కూడుకున్న పని. పైగా వెళ్ళినా రాఘవులు పలకడు, చూడడు కదా! అని సరిపెట్టుకున్నా.

ఆ ఆస్పత్రి కంటే రాఘవులు ఇల్లు దగ్గర. కనుక నేనూ, మా ఆవిడ ఓ సెలవు రోజున వాడింటి కెళ్ళాం. కనీసం భార్యా, పిల్లలుంటారు, విషయం తెలుసుకోవచ్చు, పలకరించవచ్చని.

రాఘవులూ, నేనూ ఒకేసారి ఉద్యోగంలో చేరాం! ఒకే స్థాయి ఉద్యోగం మాది. అయితే అంతవరకే సామ్యం. నేను ఫైళ్ళల్లో కూరుకుపోయి వుంటే, వాడు పైలాపచ్చీసుగా ఎప్పుడూ తిరుగుతూ క్షణం సీట్లో వుండేవాడు కాదు.

అధికార్లు చేసేవాడినే ఇంకా పని చేయి అని సతాయించడం, ఎగ్గొట్టి తిరిగేవాడిని వదిలెయ్యడం తల్చుకుంటే, 'పెట్టనమ్మ పెట్టనే పెట్టదు, పెట్టేమ్మకేమో పెద్ద మాయరోగం' అన్న సామెత గుర్తుకొచ్చేది. కానీ ఏం చేయలేక, ఎదిరించే ధైర్యం లేక, గానుగెద్దులా బ్రతకడం అలవర్చుకున్నా.

రాఘవులు పార్టీ వస్తేగానీ కాగితం బయటకు తీసేవాడు గాదు. పైసలు చేతిలో పడితేగాని పని పూర్తిచేసేవాడు గాదు. ఉద్యోగంలో చేరిన రెండేళ్ళకే స్కూటరు కొన్నాడు. ఐదేళ్ళలోనే స్థలం కొన్నాడు. బ్యాంకులోను సంపాదించి ఇల్లు కట్టాడు. రాఘవులు చేతిలో డబ్బు సంపాదించే మంత్రదండం వుండి వుంటుంది. ఎప్పుడూ అడిగిన వాడికీ,

అడగని వాడికీ అప్పులు ఇస్తూ వుండేవాడు. ఆ అప్పుల వాళ్ళ జాబితాలో నేను ప్రథముడిని.

"ఒరేయ్! నీవల్ల కాదురా! నువ్వు పేడపురుగువి. ఫైళ్ళు! కాగితాలు! రూల్స్! ఇవే నీకు తెలుసు. నేను అలా కాదు. డబ్బు సంపాదించడం వృత్తిగా పెట్టుకున్నా. లాభం లేనిది ఏ పనీ చేయను" అనేవాడు రాఘవులు.

మేం రాఘవులు ఇంటికెళ్ళేసరికి ఇంట్లో వాడి తల్లి తప్ప ఎవ్వరూ లేరు.

"కోడలు పెళ్ళి కెళ్ళింది నాయనా! పెద్దాడు గోవా వెళ్ళాడు. చిన్నాడు హాస్టల్‌లో గదా వుండేది. అమ్మాయి, ఎక్కడికెళ్ళిందో!" అని చెప్పింది రాఘవులు తల్లి.

"మరి హాస్పిటల్‌లో ఎవరున్నారు?" - మా ఆవిడ అడిగింది.

"డబ్బు కడితే అంతా వాళ్ళే చూసుకుంటారుట. పైగా ఎవర్నీ రానివ్వడం లేదుట! నన్నెవ్వరూ ఆస్పత్రికి తీసుకెళ్ళలేదు. వాడిని చూసి పదిహేను రోజులైంది."

మేం వచ్చేశాం.

"మొగుడు హాస్పిటల్‌లో వుంటే ఆవిడ పెళ్ళికెలా వెళ్ళిందండీ?" - మా ఆవిడ ప్రశ్న.

ఆ ప్రశ్నకు సమాధానం నాకూ తెలియదు.

పిల్లాడికి నలతగా వుంటే డాక్టరు చుట్టూ తిరగడం, వాడు ముక్కినా, మూలిగినా నిద్ర మానుకుని పక్కనే కూర్చోవడం మాకు అలవాటు.

నేను మళ్ళీ రాఘవులు ఇంటికి వెళ్ళలేదు. వాళ్ళూ, వీళ్ళూ చెప్పగా తెలుసుకున్నదేమిటంటే రాఘవులకి ప్రాణాపాయం లేదు. నెల రోజుల తర్వాత ఇంటికి వస్తాడని. ఇంటికొచ్చాక వెళ్దాములే అని సరిపెట్టుకున్నా.

రోజులు గడుస్తున్నాయి. డబ్బులు లేకపోవడం, పిల్లల చదువులకు ఫీజులు, గుడ్డలు, రోగాలు, పురుళ్ళు అన్నీ మామూలే!

"కొబ్బరి నూనె కొనాలి."

"వానా కాలం తడుస్తాం, నూనె లేకపోతేనేం?"

"పాలకు డబ్బు కట్టాలి!"

"కడదాం! ఫస్టు రానివ్వు!"

"మా అమ్మకు వంట్లో నలతగా వుందిట. నన్ను చూడాలని కలవరిస్తున్నదట!"

"నువ్వెళ్ళినా, వెళ్ళకపోయినా ఆవిడ జబ్బు తగ్గదు, పెరగదు."

"అమ్మాయి పురిటి కొస్తానని రాసింది."

"తెద్దాం! తొమ్మిదో నెల రానివ్వు!"

"ఏమిరా! కాశీ తీసుకువెడతానంటివే!"

"తీసుకెడతా! కాశీ ఎక్కడకూ పోదు. నువ్వూ ఎక్కడకు పోవు!"

ఇదీ నా నిత్యకృత్యం -

రాఘవులు ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యాడని తెలిసింది. వెళ్ళాలని మనసులో

వున్నా వెడితే ఆ మాటా, ఈ మాటా అయ్యాక, నేనివ్వాల్సిన బాకీ గుర్తొచ్చి.....

"ఒరేయ్! ఆస్పత్రిలో ఫీజు, మందులు కల్సి తడిసి మోపెడయ్యాయిరా! డబ్బుకి ఇబ్బందిగా వుంది" అని బాకీ అడుగుతాడేమోనని మనసులో బెంగొకటి.

ఊళ్ళో వున్న పొలం ఏదో ధరకి అమ్మేసి అప్పులు తీర్చేద్దామని ఆవేశం రావడం ఆల స్యం! మా అమ్మ ఎవరో అకస్మాత్తుగా పోయినట్టు శోకాలు తీసి -

"నా పెళ్ళయిన కొత్తలో పుట్టింటి వారిచ్చిన సొమ్ముతో మీ నాన్న ఆ పొలం కొన్నాడు. దానిమీద ఆదాయంతో మీ కందరికీ చదువులు చెప్పించి పెళ్ళిళ్లు చేశాడు. దాన్ని నే బ్రతికుండగా అమ్మావో నూతిలో పడి ఛస్తా ఏమనుకున్నావో!" అని అంటుంది.

ఈ బస్తీలో నూతులు లేవు. ఆమె చావదు. ఇది తెలిసినా ఆమె కన్నతల్లి. ఆమె కాదన్న పని చేయడం ఎందుకులే అన్న అనుబంధం అడ్డొచ్చేది. ఇంతలో రాఘవులే కబురెట్టాడు ఓసారి రమ్మని. ఇహ వెళ్ళక తప్పలేదు! దోషి బోనెక్కినట్టుగా వాడి ఇంటికి వెళ్ళా.

ఇల్లంతా హడావిడిగా వుంది. చుట్టాలు, స్నేహితులతో కోలాహలంగా వుంది. మేడ మీద పాటలు, కేరింతలు వినపడుతున్నాయి.

రాఘవులు భార్య ఓ మెరుపులా మెరిసి, "అన్నయ్యగారూ! ఇవాళ మా పెళ్ళి రోజు. మా పెద్దాడి పుట్టిన రోజు కూడా. సమయానికొచ్చారు. మేడ మీదికి రండి" అని వెళ్ళి పోయింది.

"నాయనా! ఇటు వీడు ఇక్కడ...." - రాఘవులు తల్లి పిలిస్తే వెళ్ళా.

రాఘవులు శవంలా ఒక గదిలో పడివున్నాడు. ఒంటి మీద అతుక్కుపోయి, నల్లగా చర్మం తప్ప కళ్ళల్లో ప్రాణం లేదు. శవానికీ, వాడికీ తేడా లేదు.

నన్ను చూసి, వాడి కళ్ళల్లో నీళ్ళు సుళ్ళుగా తిరిగాయి.

"మాటా పలుకూ లేదు నాయినా! అలా దీనంగా చూస్తుంటాడు. డాక్టర్లు ఇంకేం ఫర్వాలేదు అన్నారుట. ఏం ఫర్వాలేదో! చూడు నాయనా! వీడు ఎంత ఏకాకిగా, దిగులుగా వున్నాడో?"

"ఏం జబ్బు అన్నారూ?"

రాఘవులు ఏదో గొణిగాడు. నాకు తెలియలేదు. మేడ మీద కోలాహలం పెరిగింది. రాఘవులు కళ్ళల్లో అసహనం కూడా పెరిగింది.

"వాడు సంపాదించిన డబ్బు కావాలి. వాడక్కరలేదు. వాడిలా వున్నాడే! వాళ్ళా పుట్టిన రోజులూ, పెళ్ళి రోజులూ చేసుకోకపోతేనేం?"

నే వచ్చేశా!

డబ్బు సుఖం ఇస్తుందని తెల్సు. కానీ మనుషుల మధ్య అనుబంధాన్ని తెంచుతుందని ఇప్పుడే తెలుసుకున్నా-.